క్లుప్తంగా

చంద్రశేఖరస్వామికి ప్రత్యేక పూజలు


చంద్రేడులో కొలువైన కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి

రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడు గ్రామంలో కొలువైయున్న కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో స్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, వ్రత పూజలు చేశారు. అనంతరం స్వామివారిని సుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వీరభద్రుడికి విశేష అలంకరణ

బిక్కవోలు: మండలంలోని పందలపాక వెలమపేటలో కొలువై ఉన్న వీరభద్రుడి ఆలయంలో స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని విశేషంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సోమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పెదపూడి: మండల కేంద్రం పెదపూడి గ్రామంలో ప్రసిద్ధి చెందిన ప్రాచీన శ్యామలాంబ సమేత సోమేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి స్వామివారికి దీపారాధన చేసి భక్తులకు దర్శనం గావించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కె.వెంకట్రావు స్వామివారికి పంచామృతాభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఏపీ రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రామకృష్ణారెడ్డి రాజీనామా

అనపర్తి: ఆంధ్రప్రదేశ్ రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి అనపర్తికి చెందిన సత్తి రామకృష్ణారెడ్డి సోమవారం రాజీనామా చేశారు. వైఎస్సార్ సీపీ అధికారం కోల్పోవడంతో తన రాజీనామా లేఖను వెలగపూడిలోని ఈడబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి పంపించారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలి

పెదపూడి: గ్రామాల్లో పారిశుధ్యం మరింత మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అధికారులంతా గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వాతావరణం చల్లబడుతున్న తరుణంలో సీజనల్ వ్యాధులు తలెత్తకుండా ముందుగానే జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విధులు సమర్థంగా నిర్వర్తించండి


ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రభుత్వ ఉద్యోగులు

రాజానగరం: ప్రభుత్వ పరంగా మీకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా నిర్వర్తించాలని స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆయనను మండలానికి చెందిన పలువురు ప్రభుత్వ ఉద్యోగులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, మాజీ బీమా మిత్రలు కలుసుకుని, శుభాకాంక్షలు తెలిపారు.

మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న సభ్యులు

సీతానగరం: చినకొండేపూడిలోని నాలుగు బొమ్మల సెంటర్ సమీపంలోని షిర్డీ సాయిబాబా వసతి మందిరం చలివేంద్రం వద్ద సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. జయవరపు గంగారావు ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం జరిగింది. దాతలు ముందుకు వస్తే మరింత సేవలందిస్తామని వసతి మందిరం సేవా సమితి సభ్యులు తెలిపారు.

దూకుడుకు కళ్లెం

- మైనర్ల డ్రైవింగ్ నియంత్రణకు చర్యలు
- ప్రత్యేక డ్రైవ్ చేపట్టిన పోలీసులు
- ఇప్పటి వరకూ 65కి పైగా కేసుల నమోదు


డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కంబాలచెరువు: రహదారిపై నిబంధనలు పాటిస్తూ ప్రయాణించడం అనేది వాహనచోదకుల సమష్టి బాధ్యత. ప్రతి ఒక్కరూ వాటిని సక్రమంగా పాటించినప్పుడే ప్రయాణం సురక్షితంగా ఉంటుంది. ఎటువంటి ప్రమాదం లేకుండా గమ్యానికి చేరుకోగలం. సాధారణంగా డ్రైవింగ్ లైసెన్సు ఉన్న వారందరికీ రోడ్డు నిబంధనలపై అవగాహన ఉంటుంది. కానీ మైనర్లు నిబంధనలు పాటించరు. వేగంగా వాహనం నడపాలనే ఆలోచనతో అనేక ప్రమాదాలకు కారణమవుతున్నారు. మైనర్లు వాహనం నడపడం చట్టరీత్యా నేరం.

పెరిగిన రోడ్డు ప్రమాదాలు

ఇటీవల రోడ్డు ప్రమాదాలు సర్వసాధారణమయ్యాయి. వీటిలో అనేక మంది మృతి చెందుతున్నారు. చాలామంది గాయాలపాలై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఆయా ప్రమాదాలలో మైనర్లు వాహనాలు నడపడం వల్ల జరిగినవి కూడా ఉంటున్నాయి. అవగాహన లేని వయసు, ఉరకలేసే ఉత్సాహంతో మైనర్లు అతి వేగంగా వాహనాలను నడుపుతున్నారు. వేగంగా వెళుతున్నామా, లేదా అనే విషయం తప్ప ప్రమాదాల గురించి ఆలోచించరు. ఇలాంటి సందర్భాల్లో ప్రమాదం జరిగే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

పలు ప్రమాదాలు

ఇటీవల మైనర్లు వాహనాలు నడుపుతూ పలు ప్రమాదాలకు కారణమయ్యారు. ఈ ఘటనల్లో ఎదుట వారి ప్రాణాలు కూడా పోయాయి. వీటికి అడ్డుకట్ట వేసేందుకు రాజమహేంద్రవరం ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తున్న తల్లిదండ్రులు, వాహన యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. రాజమహేంద్రవరంలో ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ 65 పైగా మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశారు.

వాహన యజమానులపై కేసులు

నగరంలో వివిధ పనుల నిమిత్తం నిత్యం రహదారిపై మనం రాకపోకలు సాగిస్తుంటారు. మన కళ్ల ముందే ఆకస్మాత్తుగా పెద్ద శబ్దంతో రయ్‌మని, ర్యాష్‌గా ద్విచక్ర వాహనాలు దూసుకెళుతూ ఉంటాయి. వాటిని మైనర్లు డ్రైవింగ్ చేస్తూ కనిపిస్తారు. వీరిలో కొందరు వివిధ పనులపై బయటకు వచ్చిన వారైతే, మరికొందరు తమ స్నేహితులతో కలిపి సరదాగా తిరుగుతున్నవారు ఉంటారు.

బాధ్యతా రాహిత్యం

మైనర్ల బాధ్యత లేని డ్రైవింగ్ కారణంగా రహదారి ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. డ్రైవింగ్ చేసే వయసు రాకుండా, లైసెన్సు లేకుండా మైనర్లు వాహనాలు నడిపారంటే దానికి తల్లిదండ్రులతో పాటు వారికి వాహనం ఇస్తున్న వారి తప్పు కూడా ఉంటుంది. పిల్లల ఆనందం కోసం ద్విచక్ర వాహనం ఇస్తూ పరోక్షంగా వారి బంగారు భవిష్యత్తు నాశనం చేస్తున్నారు. ఇటువంటి సందర్భాల్లో ప్రమాదాలు జరిగితే వాహన యజమానులపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు.

వాహనం ఇవ్వడం నేరం

మైనర్లకు వాహనం ఇస్తే కేసులు తప్పవని పోలీసులు ప్రచారం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తరువాత వాహన యజమానులపై కేసులు నమోదు చేయడం కన్నా, ప్రమాదాలు జరగకుండా ముందుగానే అడ్డుకట్ట వేయడం ప్రధానమనే ఆలోచనతో చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలను నడపకుండా నియంత్రించడానికి కార్యాచరణ రూపొందించారు. దీనిలో భాగంగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తూ, విస్తృతంగా వాహనాల తనిఖీలు చేస్తున్నారు. డ్రైవింగ్‌లో పట్టుబడిన మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఆయా వాహనాలను స్వాధీనం చేసుకుని ఆ వాహన యజమానులను, మైనర్ల తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడుతున్నారు. మరోసారి వారికి వాహనం ఇవ్వకుండా ప్రథమ తప్పిదంగా హామీ పత్రం రాయించుకుంటున్నారు.

చర్యలు తప్పవు

మైనర్లకు వాహనాలిస్తే ఇచ్చిన వ్యక్తులపై కేసులు నమోదు చేస్తాం. పిల్లలకు వాహనాలు ఇస్తున్న తల్లిండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. చాలా మంది యువత డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్నారు. వారిపైనా ప్రత్యేక దృష్టి సారించాం. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించి సురక్షిత డ్రైవింగ్ చేయాలి.

– కె.జయప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై, రాజమహేంద్రవరం

భూసేకరణ చట్టం సక్రమంగా అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

సీటీఆర్ఐ: కూటమి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు విషయంలో కొత్త భూసేకరణ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా అంచనా వేసి తిరిగి కేంద్రానికి నివేదిక పంపాలని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి అయినాపురపు సూర్యనారాయణ, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి పిట్టా వరప్రసాద్, ఆమ్ ఆద్మీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ శ్రీనివాసరావు కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జగ్గంపేటలో తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీ మేరకు గిరిజనుల సౌకర్యార్థం రంపచోడవరం కేంద్రంగా మరో జిల్లా ఏర్పాటు చేయాలని కోరారు. అంబేడ్కర్ విదేశీ విద్యను పునరుద్ధరించడంతో పాటు ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాక్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం చేసిన ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ భూముల బదలాయింపు నిషేధ చట్టం 9/77 చట్ట సవరణను రద్దు చేయాలని, జగనన్న కాలనీలకు ఎస్సీ, ఎస్టీ, బీసీల నుంచి తీసుకున్న అసైన్డ్ భూములకు సుమారు రెండున్నర వేల కోట్ల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లింపునకు చర్యలు తీసుకోవాలన్నారు.

పాఠశాలలు తెరిచే నాటికే విద్యా కానుకలు సిద్ధం చేయాలి

జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు


రంగంపేట హైస్కూల్లో విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న వాసుదేవరావు

రంగంపేట: పాఠశాలలు తెరిచే నాటికే విద్యా కానుకలు సిద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు సూచించారు. మండల కేంద్రమైన రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా కానుకల స్టోర్ రూమ్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి వారీగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, తదితర సామగ్రి తయారు చేయడంలో రంగంపేట పీటీఐ, సీఆర్‌ఎంటీ కార్యాలయాల సిబ్బంది కృషి అభినందనీయన్నారు. ఈ సందర్భంగా పాఠ్యపుస్తకాలు 29,929, నోటు పుస్తకాలు 27,772, బెల్ట్‌లు 2,501 స్టోర్ రూమ్‌లో ఉన్నాయని మండల విద్యాశాఖాధికారి పి.మధుసూదనరావు చెప్పారు. మిగిలిన సామగ్రి ఈ వారంలోగా అందజేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు దుర్గారావు, సాయి, సూర్యనారాయణ, శ్రీనివాసరాజు, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు మూర్తి, బూరిబాబు, లక్ష్మి, శ్రీలక్ష్మి, ప్రసన్న, భవానీ, చిన్నారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు


వెదుళ్లపల్లిలో కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

సీతానగరం: ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ మూడోసారి అధికారం చేపట్టిన సందర్భంగా నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్న చౌదరి ఆధ్వర్యంలో సోమవారం సంబరాలు నిర్వహించారు. వెదుళ్లపల్లిలోని ఆయన నివాసంలో కేక్ కట్ చేశారు. అలాగే రాజమహేంద్రవరం ఎంపీగా దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేగా బత్తుల బలరామకృష్ణ విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి పరామర్శ


చిన్ని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు సోదరుడు, సినీ ఎగ్జిబిటర్ జక్కంపూడి శ్రీనివాసరావు(చిన్ని) కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సోమవారం పరామర్శించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చిన్నాన్న జక్కంపూడి చిన్ని రాజమహేంద్రవరంలో శనివారం మృతి చెందారు. దీంతో డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సోమవారం రాజమహేంద్రవరం వెళ్లి చిన్ని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. జక్కంపూడి రాజాతో పాటు చిన్ని కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఘనంగా కుంతీదేవి జాతర


ఆకట్టుకున్న గారడీ నృత్యాలు


జాతరలో విచిత్ర వేషధారణలు

పెదపూడి: మండల కేంద్రం పెదపూడి గ్రామంలో కుంతీదేవి జాతర మహోత్సవం స్థానిక అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. ఆలయంలో కుంతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన గారడీ నృత్యాలు, తీన్మార్ డప్పు వాయిద్యాలు, బ్యాండ్ మేళాలు, శక్తి వేషాలు, దేవతామూర్తులు వేషధారణలు, అఘోర నృత్య విన్యాసాలు ఆలయం వద్ద ప్రదర్శించారు. అనంతరం కుంతీదేవి ఊరేగింపు ప్రారంభించి సోమవారం రాత్రి వరకూ నిర్వహించారు. ఆలయం వద్ద విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మండల నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అంబేడ్కర్ యూత్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

వైద్యశిబిరం

కడియం: దామిరెడ్డిపల్లిలోని మండల పాస్టర్స్ ఫెలోషిప్ చీఫ్ పాట్రన్ డి.రత్నరాజు బైబిలు మిషన్ మందిరంలో సోమవారం వైద్య శిబిరం జరిపారు. రత్నరాజు తండ్రి అర్లపరాజు జ్ఞాపకార్థం రాజమహేంద్రవరం డెల్టా ఆసుపత్రి వైద్యుల సహకారంతో ఈ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని సర్పంచ్ ముద్రగడ జెమి, ఎంపీటీసీ విత్తనాల సాయికుమార్, మాజీ ఎంపీటీసీ రంపం గోపాలకృష్ణ, నర్సరీ అసోసియేషన్ నాయకులు గాజుల రత్తయ్య, షేక్ సిద్ధ ప్రారంభించారు.

మురుగునీటితో ప్రజల అవస్థలు


రోడ్డుపైకి చేరిన మురుగునీరు

సీతానగరం: మండలంలోని ఇనుగంటివారిపేట ఎస్సీపేటలో డ్రైనేజీ నీరు పొంగిపొర్లడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆ ప్రాంతంలోని కాలనీ గేటు నుంచి ఎగువకు డ్రైనేజీ నీరు పోటెత్తుతోంది. నిల్వ ఉండిపోతున్న నీటి వల్ల రోగాలు ప్రబలుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పేటలోని డ్రైనేజీల నుంచి వెళ్లే వాడకం నీటికి మెయిన్ డ్రైన్‌లో కలవడానికి మార్గం లేకపోవడంతో ఈ సమస్య ఏర్పడింది. రాజమహేంద్రవరం – సీతానగరం రోడ్డును ఆనుకుని ఉన్న మెయిన్ కాలువలో పూడిక తీయకపోవడంతో గ్రామంలోని వాడకం నీరు ఎస్సీపేటలో ఇళ్ల ముందుకు చేరింది. ఇక్కడ సుమారు 50 ఇళ్లలో సుమారు 200 మంది ప్రజలు నివసిస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపల్ పార్కు ఆర్చ్ కూల్చివేత దారుణం


దుండగులు కూల్చివేసిన ఆర్చ్‌ను పరిశీలిస్తున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక 42వ డివిజన్ మున్సిపల్ కాలనీలోని మున్సిపల్ పార్కు గేటు ఆర్చ్‌ను కూల్చివేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని రాజమహేంద్రి పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఆ పార్కులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ పార్కులో గతంలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవన్నారు. ఈ విషయాన్ని అప్పటి మున్సిపల్ కమిషనర్ విజయ రామరాజుకు తెలియజేయగా కాంపౌండ్ వాల్‌కు రూ.75 లక్షలు మంజూరు చేశారని, ఆ నిధులతో పార్కు చుట్టూ గోడ నిర్మాణం జరిగిందన్నారు. ప్రశాంతంగా ఉండాల్సిన పార్కును అసాంఘిక పనులకు ఉపయోగిస్తున్న వారిని మందలించామని, ఆ క్రమంలో కొందరు కక్షగట్టి ఆర్చ్‌ను కూల్చి వేసి ఉంటారని ఆరోపించారు. ఈ ఘటనపై త్రీటౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం వెంటనే స్పందించి బ్లేడ్ బ్యాచ్‌ల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో గారపాటి విశ్వనాథం, జాలా నటరాజ్, పినిశెట్టి సుబ్బరాజు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా విద్యాసంవత్సరం


సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ రేంజ్ డీఐ దిలీప్ కుమార్

కంబాలచెరువు: నూతన విద్యా సంవత్సరాన్ని ప్రణాళికాబద్ధంగా ప్రారంభించాలని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం అర్బన్ పరిధిలోని ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాడు – నేడుకు సంబంధించిన అన్ని పనులు ఈ నెల 12వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా చూడాలన్నారు. తరగతి గదులను శుభ్రం చేయించాలని, ఆర్వో ప్లాంట్లను పూర్తిగా వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణ సామగ్రి విద్యార్థుల బోధనకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. రన్నింగ్ వాటర్ సౌకర్యంతో మరుగుదొడ్లను అందుబాటులో ఉండాలన్నారు. ఎగ్, చిక్కీ, రాగి జావ, బెల్లం వంటి సామగ్రి ని ముందుగా సిద్ధపరచుకుని ఉండాలన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం స్టూడెంట్ కిట్ల పంపిణీ తేదీని ప్రకటిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి పాఠశాలలకు అందిన సామగ్రి వివరాలను స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, ఐఎఫ్‌పీ ప్యానెళ్లు, స్మార్ట్ టీవీలను వర్కింగ్ కండిషన్‌లో ఉండేలా చూడాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు రెమిడియల్ టీచింగ్ నిర్వహించాలన్నారు. అకడమిక్ క్యాలెండర్ ఆధారంగా బోధన నిర్వహించాలని, అడ్మిషన్లకు ప్రత్యేక ర్యాలీలు నిర్వహించి, ప్రజలకు ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు.

ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీలకు సూచనలు

ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీలతో అర్బన్ డీఐ దిలీప్ కుమార్ ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. వంటగది పరిశుభ్రంగా ఉండాలని, గుడ్లు ఉడికించే ముందుగా వాటి నాణ్యతను చూడాలన్నారు. కూరగాయలను పరిశుభ్రంగా కడిగి వండాలన్నారు. పాడైపోయిన గుడ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదన్నారు. ఇటీవల నిర్వహించిన శిక్షణలో తెలిపిన సూచనలను పాటించి, వంట చేయాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఎంఈవో రమా రజని, ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, సీఆర్పీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, పబ్బినీడి ప్రసాద్, కోటేశ్వరి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం


శిక్షణ పూర్తి చేసి, సర్టిఫికెట్లు అందుకున్న వారితో నిర్వాహకులు

రాజానగరం: ఆరోగ్యానికి యోగా సాధన ఎంతో అవసరమని, యోగాసన జడ్జెస్‌గా శిక్షణ పూర్తి చేసిన మీరంతా యోగాపై ప్రజలలో మరింత చైతన్యాన్ని తీసుకురావాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో రాజానగరం మండలం కానవరంలోని రాపర్తి రామ యోగా కాన్స్టిట్యూషనల్ ట్రస్టు వేదికగా మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగాసనా జడ్జెస్ ట్రైనింగ్ ప్రోగ్రాం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన వారికి వీసీ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 70 మంది ఈ శిక్షణలో పాల్గొన్నారని అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ, కోఆర్డినేటర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

కోడ్ ముగిసినా.. తొలగని ముసుగులు


మోరంపూడి జంక్షన్‌లో వైఎస్సార్ విగ్రహానికి తొలగించని ముసుగు


రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో శిలాఫలకం పరిస్థితి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ రాజమహేంద్రవరం రూరల్, సిటీ నియోజకవర్గాల్లో రాజకీయ నాయకుల విగ్రహాలకు, శిలాఫలకాలకు వేసిన ముసుగులు తొలగించలేదు. కలెక్టర్ ఎన్నికల కోడ్ ప్రకటించగానే రాజకీయ నాయకుల విగ్రహాలతో పాటు, ప్రజాప్రతినిధులు పేర్లు ఉన్న శిలాఫలకాలకు ప్రభుత్వ సిబ్బంది ముసుగులు వేశారు. అయితే ఎన్నికల కోడ్ ముగిసిందని కలెక్టర్ ప్రకటించి నాలుగు రోజులు గడుస్తున్నప్పటికీ వాటిని తొలగించలేదు.


బొమ్మూరు సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి ముసుగు